
ప్రజాశక్తి
శుక్రవారం 24 మే 2024



విద్యుత్తు కోతలతో అవస్థలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో అప్రకటిత విద్యుత్తు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటల పాటు విద్యుత్తు నిలుపుదల చేయడంతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఉక్కపోతకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్తు కోతలపై సంబంధిత అధికారులను ప్రశ్నిస్తుంటే ఇఎల్ఆర్ అంటూ సమాధానం దాటవేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. రాత్రి, పగలూ తేడాలేకుండా ఎప్పుడు పడితే అప్పుడు కరెంటు కోతలు విధిస్తున్నారు. దీంతో దోమలతో అనారోగ్యాల పాలై ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



రోగులతో కిటకిటలాడుతున్న ఏరియా ఆస్పత్రి

ఏజెన్సీలో వైరల్ జ్వరాలు, మలేరియా కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. గత వారం రోజులుగా రోగులతో సీతంపేట ఏరియా ఆస్పత్రి కిటకిటలాడుతోంది. ఎపిడమిక్ సీజన్ మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. కానీ, ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరగడం, దాంతోపాటు కొద్దిపాటి వర్షాలు కురవడం, అపారిశుధ్యంతో దోమలు పెరగడం, కలుషిత జలాలు తాగడం వల్ల వైరల్ జ్వరాలు, మలేరియా బారిన పడుతున్నారు. దోమతెరలు పంపిణీ చేసినా, మలాథియన్ స్ప్రేయింగ్ చేసినా ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదు.

ఏజెన్సీలో.. విజృంభిస్తున్న మలేరియా

పెరుగుతున్న జ్వర పీడితులు • రోగులతో కిటకిటలాడిన ఏరియా ఆస్పత్రి

ప్రజాశక్తి-సీతంపేట

ఏజెన్సీలో మలేరియా, వైరల్ జ్వరాలు చాప కింద నీరులా ప్రబలుతున్నాయి. సీతంపేట ఏరియా ఆస్పత్రిలో రోజుకు ఈ సీజన్లో 300 వరకు ఒపి పెరిగింది. వీటిలో సుమారు 15 మంది వరకు వైరల్, 5 వరకు మలేరియా కేసులు నమోదవుతున్నాయి. సీతంపేట మండలంలో గడ్డికారెం గ్రామానికి చెందిన ప్రణీత్, సంతోషి, నిమ్మక వైష్ణవి, లాడకు చెందిన ఆరిక భాస్కరరావు, మానాపురానికి చెందిన అప్పలమ్మ, బోడయ్య, కొత్తూరుకు చెందిన తిరుపతిరావు, హడ్డుబంగి పనసగూడకు చెందిన సవర తిరుపతిరావుకు మలేరియా పాజిటివ్ నమోదైంది. గత మూడు రోజులుగా ఈ కేసులు నమోదయ్యాయి. వీరికి సీతంపేట ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే కొన్ని మలేరియా కేసులను డిశ్చార్జి చేశారు. గతేడాది ఇదే సీజన్లో దోనుబాయి పరిసర ప్రాంతాల్లో అధికంగా మలేరియా కేసులు నమోదయ్యాయి. గత నెలలో మర్రిపాడు, పూతికవలస పరిసర ప్రాంతాల నుంచి మలేరియా కేసులు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ఎండ వేడిమి తట్టుకోలేక, కలుషిత నీరు తాగడంతో వైరల్ జ్వరాలు కూడా విజృంభిస్తున్నాయి. దీంతో ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది.

దీనిపై ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా మలేరియా కేసులు వస్తున్నాయని, వీరికి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.



వైద్య సేవలు అందిస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి భానుప్రతాప్ వద్ద ప్రస్తావించగా మలేరియా కేసులు నమోదైన చోట వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరికీ వైద్య పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 16 నుంచి పిచికారీ చేస్తున్నామని, దోమతెరలు పంపిణీ చేశామని తెలిపారు. వైద్య సిబ్బంది ద్వారా సర్వే కూడా చేపడుతున్నామని వివరించారు. ఇప్పటికే వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశామని సమాధానం ఇచ్చారు.

జ్వరాలపై అప్రమత్తం

ఏజెన్సీలో వ్యాప్తి చెందుతున్న వైరల్ జ్వరాలు, మలేరియా కేసులపై అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ విజయపార్వతి వైద్యులను ఆదేశించారు. గురువారం దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి మరణాలూ సంభవించకుండా చూడాలని ఆదేశించారు. జ్వరాలుంటే వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి, పరీక్షలు చేయాలని సూచించారు. సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు భానుప్రతాప్, గిరీషా, హెల్త్ సూపర్వైజర్లు తదితరులు ఉన్నారు



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎంహెచ్ఒ విజయ పార్వతి



సింధునగర్ గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించి మూతపడిన పాఠశాల

చదువు.. దూరభారం

- పాఠశాలలు మూతపడటంతో దూరప్రాంతాలకు వెళ్లలేకపోతున్న విద్యార్థులు
- పునరుద్ధరించాలని కోరుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి-వీరఘట్టం

ప్రభుత్వ విద్య రోజురోజుకూ విద్యార్థులకు దూరభారమవుతోంది. ప్రభుత్వ విధానాలు, విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో కొన్ని పాఠశాలలను మూసేసిన విషయం తెలిసిందే. దీంతో దూర ప్రాంతాల్లో పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తమ గ్రామాల్లో మూతపడిన పాఠశాలలను తక్షణమే పునరుద్ధరించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మండలంలోని సింధునగర్, పెద్దగదబవలస, వంకాయల గెడ్డ, గాదిలంక, తదితర గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఒక్కొక్క గ్రామంలో 15 మంది నుండి 25 మంది విద్యార్థుల వరకు ఉన్నారు. సింధునగర్ గ్రామానికి చెందిన విద్యార్థులు సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న పెద్దూరు గ్రామంలో ఉన్న పాఠశాలలో చదువుతున్నారు. పెద్దగదబవలస గ్రామానికి చెందిన విద్యార్థులు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కత్తులకవిటి పాఠశాలకు, వంకాయలగెడ్డ గ్రామానికి చెందిన విద్యార్థులు దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎం.రాజపురం పాఠశాలకు, గాదిలంక గ్రామానికి చెందిన విద్యార్థులు అర కిలోమీటర్ దూరంలో ఉన్న మూలలంక పాఠశాలకు, శృంగరాయపురం గ్రామానికి చెందిన విద్యార్థులు అర కిలోమీటర్ దూరంలో ఉన్న బొడ్లపాడు పాఠశాలకు వెళ్లి విద్యను కొనసాగిస్తున్నారు. ఇటీవల పెద్దగదబవలస గ్రామ సర్పంచ్ రాయల దాలమ్మ తమ గ్రామంలో మూతబడిన పాఠశాలను పునరుద్ధరించాలని అప్పటి సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనకుమారికి గ్రీవెన్స్లో వినతినిచ్చారు. గ్రామాల్లో లక్షలాది రూపాయలు అంచనా వ్యయంతో భవనాలు నిర్మించినప్పటికీ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల పాఠశాలలు మూత పడినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యా శాఖ ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో మూతపడిన పాఠశాలలను తెరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంఇఒ ఆర్.ఆనందరావు వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా, డిఇఒ దృష్టికి తీసుకువెళ్తానని వివరణ ఇచ్చారు.

25న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-సీతంపేట

ఈ నెల 25న శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం పెద్దపేట గ్రామంలో ఆర్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి ఉన్న యువత రక్తదానానికి ముందుకు రావాలని కోరారు.



లేఅవుట్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ, రెవెన్యూ అధికారులు

అడ్డగోలుగా అమ్మేస్తున్నారు!

- పంచాయతీ, బుడా అనుమతులు లేకుండా ప్లాట్ల విక్రయాలు
- హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మేజర్ పంచాయతీ పరిధిలోని పూతికవలస, కస్పాగదబవలస, శివన్నపేట గ్రామానికి అనుసరించి ఉన్న 427, 41, 25/7 సర్వే నెంబర్లలో సుమారు 5 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్ వేశారు. పంచాయతీ, బుడా అనుమతి లేకుండా స్థలాలు అమ్మకాలు చేపడుతుండటంతో గురువారం సాయంత్రం ఆ స్థలాల వద్ద పంచాయతీ, రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అనుమతులు తీసుకోవాలని గతంలో వారికి నోటీసులు ఇచ్చామని పంచాయతీ కార్యదర్శి బి.అనిత తెలిపారు. వారు పట్టించుకోకుండా స్థలాలు అమ్ముతున్నందున హెచ్చరిక బోర్డు పెట్టామని చెప్పారు.

ఇప్పటికైనా అనుమతులు తీసుకోకుండా అమ్మకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ కె.స్వరాజ్యం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె.రస్మిత పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు

డిఎంఒ జగన్మోహనరావు

ప్రజాశక్తి-పాచిపెంట

మలేరియా నియంత్రణ ధ్యేయంగా మొదటి విడత దోమల మందు పిచికారీ చేపడుతున్నట్లు జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) టి.జగన్ మోహనరావు తెలిపారు. మండలంలోని పి.కోనవలస, పనసలపాడు గ్రామాల్లో ఇంటింటికీ చేపట్టిన స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. స్ప్రేయింగ్ నిర్వహిస్తున్న తీరు, స్ప్రే నిబంధనలను ఏ మేరకు పాటిస్తున్నారో తనిఖీ చేశారు. స్ప్రే పూర్తయిన ఇళ్లకు మార్కింగ్ తప్పనిసరని ఆదేశించారు. మార్కింగ్ వేసిన ఇళ్లల్లో స్ప్రే జరిగిన విధానాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏడు సబ్ యూనిట్ల పరిధిలో 401 మలేరియా ప్రభావిత గ్రామాల్లో మొదటి విడత స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నామని వివరించారు. ఇందులో సాలూరు సబ్ యూనిట్ పరిధిలో 126 గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 15న ప్రారంభమైన స్ప్రేయింగ్ వచ్చే నెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు. మలేరియా, డెంగీ ప్రబలకుండా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు స్ప్రేయింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం జిఎన్.పేట పిహెచ్సిని తనిఖీ చేశారు. ప్రతి రోజూ ఒపిలో జ్వర లక్షణాలున్న వారు ఏ మేరకు వస్తున్నారు, నిర్వహిస్తున్న పరీక్షలు, వారి నివేదికల వివరాలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, వైద్యాధికారి స్తుతి, సబ్ యూనిట్ అధికారి ఎం.ఈశ్వరరావు, వి.శివకుమార్, ఆదిలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న డిఎంఒ జగన్మోహనరావు

వసతిగృహాల్లో పిచికారీ

సాలూరు : పట్టణంలో బంగారమ్మ కాలనీలో గిరిజన సంక్షేమ, బిసి సంక్షేమ వసతి గృహాల్లో దోమల మందు పిచికారీని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు గురువారం పరిశీలించారు. దోమల మందు పిచికారీ చేస్తున్న తీరు, వినియోగించిన ఎసిఎం రసాయనం తనిఖీ చేశారు. రాబోయే సీజన్లో వసతి గృహ విద్యార్థులకు జ్వరాలు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా స్ప్రేయింగ్ దోహదపడుతుందన్నారు. హాస్టల్లో అన్ని గదులు, టాయిలెట్లకు స్ప్రేయింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో డ్రైడే కార్యక్రమం పక్కాగా నిర్వహించాలన్నారు. వైద్య సిబ్బంది, మున్సిపల్, వార్డు సిబ్బంది సమన్వయంతో ప్రజలు డ్రైడే పాటించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మలేరియా, డెంగీ నియంత్రణకు సమిష్టి కృషి చేయాలన్నారు. దోమల లార్వా వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్లో అప్లోడ్ చేసి, వార్డు సచివాలయ కార్యదర్శులు పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎ.ప్రియాంక, ఎఎంఒ సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి ఎం.ఈశ్వరరావు, సూపర్వైజర్ ఎవి.రత్నం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింహాచలం

ప్రాణాపాయ స్థితిలో యువకుడు

రక్తదాతల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని అరసాడ గ్రామానికి చెందిన శివ్వాపు సింహాచలం అనే యువకుడు ఎనీమియాతో బాధపడుతున్నాడు. రక్తం చాలక ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ యువకుడి శరీరంలో 1.4 పాయింట్ల రక్తం మాత్రమే ఉందని వైద్యులు చెబుతున్నారు. రక్తం అత్యవసరం కావడంతో అరసాడ గ్రామానికి చెందిన ఆర్ఎంపి చొల్లంగి నీలకంఠం గురువారం ఆస్పత్రికి వెళ్లి యూనిట్ రక్తాన్ని దానం చేశాడు. ఆ యువకుడికి ఆరు యూనిట్ల రక్తం అవసరం కాగా, రెండు యూనిట్ల బ్లడ్ను దాతలిచ్చారు. మరో నాలుగు యూనిట్ల రక్తం అవసరం కావడంతో కుటుంబ సభ్యులు దాతల కోసం ఎదురుచూస్తున్నారు. రక్తదాతలు స్పందించి 89854 94653 నంబర్ను సంప్రదించాలని వారు వేడుకొంటున్నారు.



స్థల పరిశీలిస్తున్న చేస్తున్న అధికారులు

బాలికల వసతిగృహానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బాలికల వసతిగృహం మంజూరు కావడంతో గురువారం పిఎం ఉష బృందం, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులు, ప్రిన్సిపల్ చలపతిరావు స్థల పరిశీలన చేశారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న ఆట మైదానం, తరగతి గదులను పరిశీలించారు. తరగతి గదుల సుందరీకరణకు చర్యలు చేపట్టేందుకు, ఆట స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు, గర్ల్స్ హాస్టల్ నిర్మాణానికి ప్రణాళికలను తయారు చేస్తామని వారు తెలిపారు. పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభిస్తామని చెప్పారు.

నవధాన్యాలతో నేల సారవంతం

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

నవధాన్యాలు సాగు చేయడం ద్వారా నేల సారవంతం అవుతుందని డిపిఎం షణ్ముఖరాజు తెలిపారు. గురువారం మండలంలోని పెదమేరంగి యూనిట్ బిత్తరపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు నవధాన్య విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మనతోపాటు సకల జీవరాశులు మనుగడ సాగించడం కష్టతరంగా ఉందన్నారు. రైతుమిత్రులైన వానపాముల వృద్ధి కూడా నానాటికీ తగ్గటం, ప్రకృతి వనరులు, కృత్రిమంగా జీవన ఎరువులు ఉపయోగించడం వల్ల భూమిని సారాన్ని కోల్పోతుందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాన పంటకు అవసరమైన అన్ని రకాల పోషకాలు ఈ నవధాన్యాలు వేయడం వల్ల లభిస్తాయని చెప్పారు. జిల్లాలో 15 మండలాల్లో రైతులు ఈ విధమైన కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉండటంతో కార్యకర్తలు కూడా వారికి తోడ్పాటు అందించాలన్నారు. ప్రతి వర్షపు నీటి బిందువులు నేలలో ఇంకే విధంగా పండ్ల తోటల్లో ట్రెంచులు, కాలువలు తీయడం వల్ల ఉపయోగంగా ఉంటుందన్నారు. అంతర పంటలుగా కొర్రలు, సామలు, ఊదలు, ఆరికలు, గంటెలు, రాగులు, సూర్యాకాంతం, పసుపు, అల్లం తదితర పంటలు సాగు చేసుకోవడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఆరుతడి పంటలైన పెసలు, మినుములు, ఉలవలు, రాగి, జొన్న, మొదలగు పంటలు వేసుకోవడం వల్ల ఆదాయంతోపాటు పౌష్టికాహారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, విఎఎ ఎం.శ్రీహరి నాయుడు, బి.ధనుంజయరావు, లత, రామకృష్ణ, నాగ పాల్గొన్నారు.



జియ్యమ్మవలస.. నవధాన్యాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డిపిఎం షణ్ముఖరాజు

సేంద్రీయ ఎరువులతో పంటలు సాగు చేయాలి

వీరఘట్టం : సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసేందుకు రైతులకు అవగాహన కల్పించాలని ఎపిసిఎన్ఎఫ్ డిపిఎం షణ్ముఖరాజు రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు సూచించారు. గురువారం స్థానిక రైతు ఉత్పత్తిదారుల కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. సేంద్రియ ఎరువుల ద్వారా పంట దిగుబడితోపాటు పెట్టుబడులు తగ్గుతాయన్నారు. 300 మంది రైతులకు ఎకరాకి 12 కిలోల చొప్పున పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జె.సౌజన్య, ఎఫ్పిఒ సిసి వై.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్ఒ విష్ణుచరణ్

స్ట్రాంగ్రూమ్ పరిశీలన

ప్రజాశక్తి-సాలూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్రూమ్ను ఆర్ఒ విష్ణుచరణ్ గురువారం పరిశీలించారు. దూరప్రాంతాలలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లోని ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం ఉంది. కౌంటింగ్ ముందు రోజు వరకు పోస్టల్ బ్యాలెట్ పంపించుకోవచ్చు. దీంతో ఆ పోస్టల్ బ్యాలెట్లను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తున్నారు. స్ట్రాంగ్ రూం వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు. అనంతరం విష్ణు చరణ్ తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఒ కార్యాలయాన్ని సందర్శించారు.

గణితావధాని నారాయణమూర్తి మృతి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్



నారాయణమూర్తి(ఫైల్)

పట్టణంలో వివేకానంద కాలనీకి చెందిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, గణితావధాని నేరెళ్ల నారాయణమూర్తి బుధవారం రాత్రి మృతిచెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన ఉపాధ్యాయ వృత్తిలో చేరిన నుండి గణితంపై ప్రతిఒక్కరూ ఆసక్తి కనబరిచేలా సులభరీతిలో బోధన చేసేవారు. పార్వతీపురం పట్టణంతోపాటు చుట్టుపక్కల ఉండే పలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులను గణితంలో ప్రావీణ్యులుగా తయారు చేశారు. ఆయన శిష్యులు, పట్టణ ప్రముఖులు, రాజకీయ నేతలు, ఉపాధ్యాయులు.. నారాయణమూర్తి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

విక్రమపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని విక్రమపురం గ్రామంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉన్నాయని, ఎక్కువగా ఎండలో తిరగరాదని సూచించారు. బయటకు వెళ్ళినప్పుడు తప్పనిసరిగా గొడుగు వేసుకోవాలన్నారు. వైద్యాధికారులు ఇచ్చే సలహాలు సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పవిత్ర, ఎఎన్‌ఎం ఎస్.పైడితల్లి, హెల్త్ అసిస్టెంట్ వై.మోహన్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనతను నివారించాలి

ప్రజాశక్తి-సీతానగరం

రక్తహీనతపై అవగాహన కలిగించాలని ఎంపిడిఒ కె.ఈశ్వర్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బందితో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనత లోపాన్ని గుర్తించి, వారికి పోషకాహారం తీసుకునే విధానాన్ని తెలియజేయాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతోనే పనిచేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి క్షేత్రాల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తి క్లస్టర్ చిన్న గుడిపాల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారులు ఆర్టిఎల్ ప్రకాష్, ఆర్‌టిఒ హేమ సుందర్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను గురువారం సందర్శించారు. బోజంకివాని పాలెంలో రైతులతో సమావేశమై ఈ ఖరీఫ్ కాలంలో వరి విత్తనాలను షీడ్ బాల్స్ చేసి విత్తుకోవడం వల్ల వర్షాలు లేటుగా కురిసిన, వర్షం ఎప్పుడు పడితే అప్పుడు సీడ్ బాల్స్‌లో ఉన్న విత్తనం మొలక రావడానికి అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఈ పద్ధతిని ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రాక్టికల్‌గా చేసి రైతులకు చూపించాలన్నారు. నువ్వులలో నవధాన్యాలు వేసిన పొలాలను పరిశీలించి రైతుల అనుభవాలను తెలుసు కున్నారు. నువ్వులలో తెల్లజొన్న, బెండ, బీర, గోంగూర, చిక్కుడు, బొబ్బర పంటలను అంతర పంటలుగా వేయటం వల్ల అదనపు ఆదాయం పొందడంతో పాటుగా పంటలలో జీవన వైవిధ్యం జరుగుతుందన్నారు. దీని ద్వారా నేలకు పోషకాలు చేకూరుతాయని చెప్పారు. ప్రతి రైతు వరికి ముందు నవధాన్యాలను వేసుకోవడం వల్ల భూమిలో పోషకాలతో పాటుగా సూక్ష్మజీవులు పెరుగుతాయని ప్రధాన పంటకు మంచి పోషకాలు అందుతాయని కలుపు నివారణ అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ వరప్రసాద్, ఎమ్.టి.ఎల్ వసంత, ఎమ్‌టి సన్యాసమ్మతో పాటుగా మండల ఇంఛార్జిలు, ఐసిఆర్‌పిలు రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి - వంగర

ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించేందుకు గ్రామాలలో ఇంటింటా సర్వే చేపడుతున్నట్లు ఎంఇఒ వై.దుర్గారావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని సంగాం, శివ్వాం, తలగాం గ్రామాలలో గురువారం సర్వే చేపట్టి పదిమందిని గుర్తించామని వెల్లడించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం వల్ల ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, విద్యా బోధన, ఉపకరణాలు, ప్రభుత్వం నుంచి వచ్చే స్కీములు అందుతాయని అన్నారు. మానసిక వైకల్యం గల పిల్లలను పాఠశాలల్లో చేర్పించే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంగోజి, నాయుడు, పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి- రేగిడి

గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులు వద్ద వేతనదారులకు సౌకర్యాలు కల్పించాలని ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ తెలిపారు. గురువారం వన్నలి పంచాయతీలో యందు వాని చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. చెరువులో 230 మంది వేతనదారులు మస్టర్స్ తనిఖీ చేశారు. ముందుగా వేదనదారులతో ఉపాధి పనులపై అవగాహన కల్పించారు. వేతనదారులతో మాట్లాడుతూ రెండు పూటలా పనిచేయాలన్నారు. కొలతలు ప్రకారం పనిచేస్తే రూ.300 కూలీ వస్తుందన్నారు. మేట్లు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు రెండు పూటలా పంపించాలని వెల్లడించారు. ప్రతీ వేతనదారులు నీళ్ళు తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు. మెట్టు పొలం ఉన్న సన్న, చిన్నకారు రైతులకు పండ్లతోటలు వేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. తోటలు ఉన్న రైతులకు కందకాలు, చెట్టు చుట్టూ ట్రెంచ్‌లు తవ్వుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్రయ్య, మేట్లు, వేతనదారులు పాల్గొన్నారు.

బిసిజి టీకా తప్పనిసరి

ప్రజాశక్తి - కొత్తవలస

బిసిజి టీకాను తప్పనిసరిగా వేసుకోవాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి. సింహాద్రినాయుడు అన్నారు. ఈ పిహెచ్‌సి పరిధిలో గల వియ్యంపేట, ముసిరామ్, దేవాడ, రామలింగాపురం, వీరభద్రపురం, తుమ్మికాపల్లి, నిమ్మళపాలెం, ఉత్తరాపల్లి సచివాలయాల్లో ప్రతీ గురువారం క్షయ వ్యాధి నివారణ కోసం వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు 18 సంవత్సరాలు దాటినవారందరికి బి.సి.జి. టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. క్షయ రోగులు ఉన్న కుటుంబ సభ్యులకు, దూమపానం చేసిన వారికీ, మాధమేహం ఉన్నవారికి, రక్త పోటు ఉన్నవారికి ఈ వాక్సిన్ తప్పనిసరిగా వేయాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు, హెచ్ఐవితో బాధపడిన వారికీ, తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టిన వారికి, రక్తమార్పిడి చేయించుకున్న వారికీ ఈ వ్యాక్సిన్ వేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.ఎన్. జగదాంబ, ఈఒ నరసింహారావు, హెచ్.వి. పద్మావతి, హెచ్.ఎస్.ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్స్ సత్యారావు, ఈశ్వరరావు, ఏ.ఎన్.ఎమ్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

కెల్ల పండగకు తాగునీరు సరఫరా

ప్రజాశక్తి-గుర్ల

మండలంలోని కెల్ల గ్రామంలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరిగిన పండగకు ధీరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బొత్స సందీప్ తాగునీరు సరఫరా చేశారు. ఆ పండగ రెండు మూడు రోజులు ముందుగా కెల్ల గ్రామ పెద్దలు, నాయకులు బొత్స సందీప్‌ని కలిసి తమ గ్రామానికి పండగలో తాగునీరు కొరత లేకుండా అందించాలని కోరారు. దీంతో నీటి సరఫరాను ధీరా ఫౌండేషన్ తరుపున చేయడానికి డాక్టర్ సందీప్ సుముఖత వ్యక్తం చేసి గ్రామానికి వాటర్ ట్యాంక్‌లతో నిరంతరం తాగునీరు సరఫరా చేశారు. పండగ మూడు రోజులు తాగునీరు అందించిన ధీరా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ బొత్స సందీప్‌కు గ్రామ యువత, పెద్దలు గురువారం కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన నేస్తం విప్పపువ్వు

- ఆదివాసీలకు ఆదాయ వనరు
- విప్పలో దివ్యౌషధ గుణాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం



సేకరించిన విప్ప పువ్వు ఆరబెడుతున్న గిరిజనులు

గిరిజనుల మొహాలు పువ్వుల్లా వికసించే కాలమిది. గుమ్మలక్ష్మీపురం మన్యంలో ఏ గిరిజన గూడేనికి వెళ్లినా విప్పపూల పరిమళం వెదజల్లుతోంది. అందమైన ప్రకృతి ఒడిలో ఉదయంపూట నడుస్తూ ఉంటే పాదాలకు మెత్తని పూలు తాకుతుంటాయి. తల పైకెత్తి చూస్తే దట్టమైన పువ్వులు దర్శనమిస్తాయి. గిరి పుత్రికలు రాలిన పూలకు అంటిన మట్టిని సుతారంగా తుడిచి జాగ్రత్తగా వెదురు బుట్టల్లో వేస్తుంటారు.

విప్పపువ్వు అటవీ ప్రాంత ప్రజల బతుకుదెరువు. విప్ప పువ్వులో దివ్యౌషధ గుణాలున్నాయి. విప్పపువ్వు వినియోగించేవారు విశేషమైన ఆరోగ్య లాభాలు పొందుతారు. ముఖ్యంగా కీళ్ల నొప్పులు, శరీర పట్లు, వాతాలకు దివ్యౌషధంలా పనిచేస్తుంది. విప్పచెట్లకు ఓ జీవన చక్రం ఉంటుంది. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు ఆకురాలే కాలం. ఆ సమయంలోనే ఘాటైన పరిమళంతో పూలు వికసిస్తూ ఉంటాయి. మార్చి నుండి మే వరకు పూలు రాలే కాలం. ఒక చెట్టు నుండి సుమారు 100 కిలోల పూలు రాలుతాయి. ప్రతి పువ్వును గిరిజనులు జాగ్రత్తగా ఒడిసి



విప్ప పువ్వు సేకరణలో గిరిజనులు

పట్టుకుంటారు. ఎందుకంటే వాళ్ల బతుకంత విప్పపువ్వుతోనే ముడిపడి ఉంటుంది. పిల్లాపాపలతో గిరిజనులు పూల సేకరణ కోసం తెల్లవారుజామున అడవికి బయలుదేరి వెళ్తారు. ఒక్కొక్కరు 5 నుంచి 10 కిలోల వరకూ సేకరిస్తుంటారు. వాటిని ఎండబెట్టి తర్వాత బుట్టలలో నింపి ఇంటి గుమ్మంలో దాచుకుంటారు. విప్పపువ్వుతో నానబెట్టిన బియ్యాన్ని కలిపి అన్నం వండుకుంటారు. బెల్లం కలిపి ఉండలు చేసుకుని, తింటారు. విప్పపువ్వును దగ్గు, శ్వాసకోస వ్యాధులకు వాడుతుంటామని గిరిజనులు చెబుతున్నారు. విప్పకాయలను పొడిచేసి పాలలో కలుపుకుని గిరిజన మహిళలు తాగుతారు. దీనివల్ల బాలింతల చనుబాలు వృద్ధి అవుతాయని అంటారు. విప్పపువ్వులను గిరిజనులు గ్రామదేవతలకు నైవేద్యంగా సమర్పిస్తుంటారు. ఈ వేసవి కాలంలో విప్పపూలను సేకరించి జిసిసికి విక్రయించి, ఆదాయం పొందుతుంటారు. ఈ ఏడాది జీడి పంట సరైన దిగుబడి లేకపోవడంతో గిరిజనుల ఆశలన్నీ విప్పపువ్వు మీదే ఉన్నాయి. విప్ప పువ్వుతో ఆయుర్వేద మందులు, నూనె లడ్డు, హల్వా, కేకులు తయారు చేస్తుంటారు. దీంతో విప్పపువ్వుకు బాగా డిమాండ్ పెరిగింది. బయట మార్కెట్లో కిలో విప్పపువ్వు రూ.25 వరకు ధర పలుకుతోంది.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు పట్టణంలోని ఆటోనగర్ సబ్‌స్టేషన్ వద్ద 33కెవి ఫీడర్, పాచిపెంట మండలం జి.ఎన్.పేట సబ్‌స్టేషన్ వద్ద ఉన్న 33 కెవి ఫీడర్ మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్తు సరఫరా ఉండదని ఆ శాఖ ఇఇ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు చెప్పారు. పట్టణంలోని ఆటోనగర్ ఏరియా, శ్రీనివాసా కాలనీ, గాంధీనగర్, మెయిన్ రోడ్, రామా కాలనీ, మజ్జులపేట, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. పాచిపెంట మండలంలోని గ్రామాలలో కూడా సరఫరా నిలిచిపోతుందని వివరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

అదనపు రెసిడెన్సీ కాలేజీలు ప్రారంభించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఆదివాసీ ప్రాంతంలో పదో తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు అందుబాటులో ఉండేలా అదనపు ఇంటర్మీడియట్ రెసిడెన్సీ కళాశాలలు ప్రారంభించాలని ట్రైబల్ రైట్స్ పోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు, జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. 30 సంవత్సరాల క్రితం జనాభా ప్రాతిపదికన ఆదివాసీ ప్రాంతాల్లో కొన్ని కాలేజీలు స్థాపించారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో జనాభా పెరగడంతో ఆదివాసీలంతా ఉన్నత చదువుల వైపు దృష్టి పెడుతున్నారని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతీ విద్యార్థికి సీటు కేటాయించేటట్లు అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ నిషేధం ఉందా..?

పాలకొండలో నిస్తేజంగా అధికారుల తీరు

ప్రజాశక్తి-పాలకొండ



పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం

పట్టణంలో ప్లాస్టిక్‌పై నిషేధం ఉన్నా కూడా ఉత్పత్తి, వినియోగం మాత్రం ఆగడం లేదు. నగర పంచాయతీ అధికారులు, ఉద్యోగులు ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని చెప్పొచ్చు. మొక్కుబడిగా షాపుల మీద దాడులు నిర్వహిస్తారని, అలా దాడి చేసే ముందు కూడా వ్యాపారస్తులకు ముందుగానే సమాచారం అందుతుందని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. దీంతో వ్యాపారులు వారి జాగ్రత్తలో వారు ఉంటున్నారు. గతంలో పాలకొండ నగర పంచాయతీ కమిషనర్‌గా పని చేసిన లిల్లీ పుష్పనాథం ప్లాస్టిక్ నిషేధం కోసం పెద్ద యుద్ధమే చేసి సఫలీకృతం అయ్యారు. మైక్రాన్లతో సంబంధం లేకుండా ఎటువంటి ప్లాస్టిక్ కవర్ కూడా పట్టణంలో కనిపించకుండా చేయడంలో ఆయన కృషి ఆమోఘమని చెప్పొచ్చు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు ఎదురైనా బేఖాతరు చేస్తూ తన పని తాను చేసుకుని పోయారు. దీనితో పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం ఒక కొలిక్కి వచ్చిందని అందరూ భావిస్తున్న తరుణంలో లిల్లీ పుష్పనాథం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన తరువాత ఆ బాధ్యతలోకి వచ్చిన కమిషనర్లు ఎవరూ కూడా ప్లాస్టిక్ నిషేధంపై దృష్టిపెట్టలేదు. గతంలో ఉన్న నిషేధాన్ని కొనసాగించలేదనే అపప్రద అయితే మూట కట్టుకున్నారు.

ఫలితంగా ప్లాస్టిక్ నిషేధిత పాలకొండ నుండి ప్లాస్టిక్ ఆధారిత పాలకొండగా పట్టణం రూపు మార్చుకుంది. లిల్లీ పుష్పనాథం తరువాత నగరపంచాయితీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ముగ్గురు అధికారులలో ఇద్దరు ఎసిబి కేసులలో ఇరుక్కొన్నారు అంటే నగర పంచాయతీలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో వ్యాపారుల్లో కూడా నగర పంచాయతీ అధికారులంటే భయం పోయి తమ వ్యాపారాలను ప్లాస్టిక్ సంచులతో కొనసాగిస్తున్నారు. దాడులు చేసి ప్లాస్టిక్‌ని అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాస్టిక్ నిషేధానికి నడుం బిగిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

డిఎంహెచ్ఒ విజయ పార్వతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ కె.విజయపార్వతి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. పిహెచ్‌సికి వస్తున్న రోగులు, అందుతున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పిహెచ్‌సిలో పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలని, సిబ్బంది అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వినోద్, శ్రీధర్, హర్ష, డిఇఎంఒ రెడ్డి, తాడికొండ వైద్యాధికారి బుద్దేశ్వరరావు, అభిలాష్, డిఎం సిహెచ్ఒ పద్మ ఉన్నారు.



తాడికొండలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ పార్వతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ గీతాంజలి

ఫ్రైజం-10పై సమీక్ష

ప్రజాశక్తి-సీతంపేట

ఫ్రైజం-10 అంశాలపై ఎంపిడిఒ కె.గీతాంజలి ఆధ్వర్యంలో వైకెపి సమావేశ మందిరంలో గురువారం మండల స్థాయి సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ బాలింతలకు రక్తహీనత లేకుండా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. ఫ్రైజం-10పై అవగాహన ఉండాలని, అందరినీ చైతన్యం చేయాలని సూచించారు. సమావేశంలో సిడిపిఒ పి.రంగలక్ష్మి, వైద్యాధికారులు సత్యవేణి, వైద్య సిబ్బంది, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-పాచిపెంట



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

నిషేధిత పత్తి విత్తనాలు విక్రయించినా, సాగుచేసినా చర్యలు తప్పవని ఎఒ కె.తిరుపతిరావు హెచ్చరించారు. మండలంలోని రాయిగుడ్డివలస పరిధిలోని భీమందొరవలసలో రైతులకు నిషేధిత పత్తి విత్తనాలపై అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలు కొనేటప్పుడు బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విషయంలో రైతులు అజాగ్రత్తగా ఉండకూడదని చెప్పారు. లైసెన్స్ కలిగిన విత్తన విక్రయదారుల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.

చిరుధాన్యాల సాగును పెంచాలి

గిరిజన రైతులు 90 శాతం విత్తన రాయితీని సద్వినియోగం చేసుకొని చిరుధాన్యాల సాగును పెంచాలని ఎఒ కోరారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం-2023 పురస్కరించుకుని సరైన మద్దతు ధరతో ప్రభుత్వమే చిరుధాన్యాలు కొనుగోలు చేస్తుందని చెప్పారు. పత్తి, మొక్కజొన్నలో అంతర పంటలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సాయి గణేష్, ఐసిఆర్‌పి సుకరమ్మ పాల్గొన్నారు.

నిరంతరం విద్యుత్తు సరఫరా చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్



పంప్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్, అధికారులు

తోటపల్లి రిజర్వాయర్ సమీపంలో ఉన్న పంపుహౌస్‌కు నిరంతరం విద్యుత్తు సరఫరా జరిగేలా కొత్త లైన్‌ను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ విద్యుత్తు శాఖ అధికారులకు సూచించారు. గురువారం మున్సిపల్ డిఇ పి.కిరణ్‌కుమార్, ఎఇ జి.ఆనంద్, విద్యుత్తు శాఖ అధికారులతో కలిసి తోటపల్లి వద్ద ఉన్న పంప్ హౌస్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతూ పంపుహౌస్‌కు ప్రస్తుతం ఉన్న విద్యుత్తు కనెక్షన్ వల్ల ఎప్పటికప్పుడు సరఫరా నిలిచిపోతుందని చెప్పారు. దీని కారణంగా పంపుహౌస్‌లో ఉన్న మోటార్లు ద్వారా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. పట్టణంలో పలు వార్డులకు సకాలంలో తాగునీటి సరఫరాలో జాప్యం తలెత్తుతోందని తెలిపారు. పంప్‌హౌస్‌కు అదనంగా ఇంకొక విద్యుత్తు కనెక్షన్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన విద్యుత్తు శాఖ అధికారులు కొత్త లైన్ ఇచ్చేందుకు త్వరితగతిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

పార్వతీపురం టౌన్ : సచివాలయాల సెక్రటరీలు, తాగునీటి విభాగం సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయాల సెక్రటరీలు, తాగునీటి విభాగం సరఫరా సిబ్బందితో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో మీ సచివాలయ పరిధిలో ఉన్న వార్డుల్లో పర్యటించి తాగునీటి సరఫరాలో జరిగే అంతరాయాన్ని గుర్తించాలని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ ఇంజినీరింగ్ డిఇ పి.కిరణ్ కుమార్, జి.ఆనంద్, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలపై చిన్నారుల ఆసక్తి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం



బొమ్మలు గీస్తున్న చిన్నారులు

గుమ్మలక్ష్మీపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలపై చిన్నారులు, విద్యార్థులు ఎంతగానో ఆసక్తి చూపిస్తున్నారు. వేసవి శిబిరాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు శాఖా గ్రంథాలయాధికారి డి.సుకన్య తెలిపారు. ప్రతిరోజూ చిన్నారులతో పుస్తక పఠనం, పత్రికలు చదివించడం, ఆటలు ఆడించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలతో విద్యార్థులు చదువు, క్రీడలు పట్ల ఆసక్తి చూపిస్తూ తమ జ్ఞానాన్ని, ప్రతిభను పెంపొందించుకోవడానికి వీలుంటుందని అన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

గరుగుబిల్లి : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. గురువారం గురజాడ అప్పారావు జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. చదరంగం, క్యారంబోర్డు తదితర ఆటల పోటీలను నిర్వహించామని శాఖా గ్రంథాలయాధికారి నల్ల మధుసూదనరావు తెలిపారు.

ఒకే సిలబస్‌ను అమలు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు ఒకే విధమైన సిలబస్‌ను ప్రవేశ పెట్టాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఫెడరేషన్ డివిజన్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బొబ్బిలి మండల శాఖ అధ్యక్షులు సిహెచ్‌జె ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు జెసి రాజు మాట్లాడుతూ 6,7 తరగతులకు గణితం, సామాన్య శాస్త్రం, ఇంగ్లీష్ సిబిఎస్ఇ సిలబస్ కాగా మిగతావి రాష్ట్ర సిలబస్ అని అలాగే 8,9,10 తరగతుల విద్యార్థులు అన్ని సబ్జెక్ట్స్‌ను ఒకే సిబిఎస్ఇ సిలబస్‌లోనే చదువుతారని కానీ పరీక్షలు వేరువేరుగా రాయాల్సి రావటంతో విద్యార్థులు, తల్లితండ్రులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని అన్నారు.

ఒకే సిలబస్ చదివిన విద్యార్థులు కొందరు సిబిఎస్ఇ పరీక్షలు రాస్తే మరికొందరు రాష్ట్ర పరీక్షల నిర్వహణ విభాగం నిర్వహించే పరీక్షలు రాస్తారని, ప్రశ్న పత్రాల స్థాయి, విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనలో వ్యత్యాసం వుంటుందని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఒకే సిలబస్, ఒకే పరీక్షల విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, విద్యార్థులందరికీ సమన్యాయం, సమాన అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. 117వ జిఒను రద్దు చేసి ప్రాథమిక విద్య బలోపేతం అయ్యేలా ఒకటి నుండి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలను ఒకేచోట పెట్టాలని డిమాండ్ చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మక్కువ

మక్కువలోని ఎస్‌సి కాలనీకి చెందిన తోట్ల మాధురి బుధవారం సాయంత్రం కిరోసిన్ పోసుకుని, నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భర్త కృష్ణ తరచూ తాగి వస్తూ గొడవలు పడుతున్న నేపథ్యంలో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు. ప్రస్తుతం ఆమె విశాఖలోని కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు ఆయన వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.